# రాంగ్ పాయింట్

"ప్రభు"

అప్పుడే ఒంటిగంట ప్యాసింజరు వెళ్ళిపోయింది. ప్లాట్‌ఫారంమీద జనం సందడి తగ్గింది. తిరిగి మూడు గంటల వరకు బళ్ళు ఏమీ లేవు. పోర్టర్లు, పాయింట్సుమెన్‌లకు ఓ గంట విశ్రాంతి లభిస్తుంది. ఏదో కాస్త రెప్పవాల్చవచ్చు—అనుకుంటారు. కాస్త నడుం వంగినవాళ్ళు యీ గంటా, అరగంటా కన్నుమూసినా ఒకటే, మేలుకున్నా ఒకటే పూరక బద్ధకం పెంచుకోడం తప్ప మరేం ప్రయోజనం లేదు. అంటూ ఒక ట్రిప్ అలా బయటికెళ్ళి ఓ కప్పు వేడివేడి 'చా' కడుపులో పోసుకొస్తూంటారు కొందరు.

వెంకన్న వయస్సు ఒకటి అరా అటో యిటో శతార్థం పూర్తి అయింది. రెండేళ్ళలో రిటైర్డు అవుతాడని వారి జాతకపత్రము (పెర్సనల్ ఫైల్) చెబుతూనే వుంది. మనిషికూడా అంతగా బలిష్టుడు కాడు. సాధారణమైన ఆరోగ్యం, మనిషిలో పిడుగువంటి స్థిరత్వం, పిచ్చిబలంలాంటి పట్టుదల, చూసేవాళ్ళకు మంచి ఎముక పుష్టి వున్నవాళ్ళా కనిపిస్తాడు. ఏది ఎలా వున్నా తన ముప్పయి ఏళ్ళ సర్వీసు నిరాఘాటంగా తోసుకొచ్చాడు.

"వెంకన్న గారూ! కొంచెం టీ పుచ్చుగొందాం బయల్దేరుదామా" అన్నాడు ఆరుమొగం. ఆ క్యాజుయల్ లేబర్ (పోర్టర్)

వెంకన్నకు ఏం సమాధానం చెప్పాలా సడన్‌గా తోచలేదు. సగలంతా యిల్లు తిరగ కప్పించి, తప్పించుకు పోయిన గేదెను వెతకడంలో ఒళ్ళంతా హూనమై పోయింది. ఆడపిల్లలత్తగారిళ్ళకెళ్ళాక భార్య ఆరోగ్యం బాగా పాడైపోయింది. వద్దన్నా ఎన్నో పన్లు నెత్తినేసుకుంటుంది. సగం నెత్తురు కుట్టు మిషన్ త్రాగేసింది. మిగతా సగం కుటుంబ క్షేమానికి. మూనెళ్ళ నుంచి కళ్ళు జ్యోతుల్లా ఎర్రగా మండిపోతున్నాయి. ఇంటిదగ్గర పన్లు (బేసిక్‌నీడ్స్) అన్నీ తను చూచుకోవాల్సి వచ్చింది. అన్ని ముగించుకొని డ్యూటీ ఎక్కేసరికి నిద్రపెద్దమ్మ నెత్తికెక్కి కూర్చుంటుంది. అయినా చాలా దినాల నుంచీ ఎలాగో ఓపికతో నెట్టుకొస్తున్నాడు. కాని యివేళ తమాయించుకొని నిగ్రహం లేదేమో అనిపించింది. మెయిలు — జనతా ఒంటి గంట ప్యాసింజరు వరకు నెగ్గుకొచ్చాడు. ఇక తాళడం అసాధ్యమనిపించింది. దీనికి తగ్గట్టు కాస్త రెస్టు కూడా దొరికిందాయె.

"చూడు — ఆరీ! నే రాలేనుగాని ఓ చిన్న పని చేసిపెట్టు ఒళ్ళంతా నలగ్గొట్టి నట్టుంది.

ఆ చిన్నబండి ప్లాట్‌ఫారం 'బంక్‌లో' వుంటా. బండి రాగానే కాస్త లేపేం."

"ఆ — మీరుపోయి తొంగేండి"

"మరిచిపోకబ్బాయ్"

"ఆ"

వెంకన్నంటే ఆరుమొగానికి పితృవాత్సల్యం. ముక్కూ మొగంఎరుగనివాన్ని తెచ్చి పెద్ద దొరకు చెప్పి క్యాజుయల్ లేబర్‌గా పెట్టించాడు మరి. అంతకుముందు ఆరుమొగం ఓ ఏకాకి. వెంకన్న వల్ల పునర్జన్మ ప్రసాదింపబడింది. వెంకన్న జాలి అలాంటిది.

తుండుగుడ్డ భుజాన వేసుకుని చిన్నబండి ప్లాట్‌ఫారం వైపు నడిచాడు. కొళాయి దగ్గర కాళ్ళు చేతులు మొగం శుభ్రంగా కడుక్కొని కడుపునిండా నీళ్ళు పట్టాడు.

ఎదురుగా సాంబయ్య పని కుర్రాడు షాపు కట్టేస్తున్నాడు. చకచకనడిచి ఓ అణా పొగాకు కాడ కొన్నాడు. ఒక్క క్షణం ముక్కునబట్టి వాసన చూశాడు. "అబ్బే వట్టి నాసిరకం కాస్త ఘాటైందియ్యబ్బాయ్" త్రిప్పి యిచ్చివేశాడు.

కొట్టు కుర్రాడు విసుక్కున్నాడు. "ఏంటయ్యా కొట్టు కట్టేశేప్పుడు గిల్లి గిల్లి బేరాలు ఓ ఏపు నిద్ర నుంచుకు ఒస్తుంటే"

వెంకన్నకి కోపమొచ్చింది. సాంబయ్య వెంకన్నకు దోస్తు. తరుచూ కుర్రకుంక నిద్రపోతాడేమో ప్యాసింజరు పోగానే కాస్త కనిపెట్టి మందలించమని చెబుతూండేవాడు.

"అయితే అబ్బాయి మీ షావుకారు కొట్టు ఎన్ని గంటలకేమిటి మూయ్యమన్నది" అన్నాడు. ఆర్యోక్తిగా. కుర్రాడు కొట్టు తలుపులు 'దభీ'లుమని మూసేస్తూ ఉక్రోషంతో అన్నాడు. "మీ పన్లు మీరు సరిగా చేస్తుండండి.— రాత్రంతా మీరు నిద్దరోకుండా కష్టపడుతూన్నట్టు మాట్లాడతావేం వెంకన్న గారూ"

వెంకన్న నోట మాట పెకల్లేదు "కాలమయిమ" సనుక్కుంటూ బంకు వైపు నడిచాడు.

అప్పటికే బంకులో రెండు మూడు మానవ కళేబరాలు గుర్రు పెడుతున్నవి. ఓమూల రెండు గార్డుల 'లైన్ బాక్సు'లున్నవి. వాటిని జత జేర్చి తుండుగుడ్డ పరచాడు. ఓ చదునైన ఇటికరాయి తలవైపు వుంచాడు.

ఆ పడుకున్నవాళ్ళలో ఒకతనికి గెడ్డం బాగాపెరిగింది. కళ్ళు లోతుగా పీక్కుపోయాయి. చొక్కా చమురు కారుతోంది. చిన్న చిన్న కీటకాలప్పుడప్పుడూ చొక్కాలోకి తొంగి చూస్తున్నవి.

"ప్చ్—పాపం— ఏంటో ఏం ఉద్యోగాలో— వల్లకాడో—అంతా గీత" తనలో అనుకున్నాడు వెంకన్న.

ఆపైనుదహరింపబడినతను తనతో పనిచేసేవాడే. మంచివాడు. వినయం, విధేయత, చురుకుదనం, అన్నీ ఉన్నాయ్. ఏం చేద్దాం ఏదో తప్పు జేశాడని. ఆరునెల్లనుంచీ సస్పెండ్‌లో ఉంచారు.

"ఏం జరగాలో. ఆపరమేశ్వరుడి కెరుక" అంటూ జేబులోంచి పొగాకుతీసిమెత్తగాచేతులతో నలిపాడు. రెండు పాయలుజేసిఒకచుట్టచుట్టి మిగిలిందిజేబులో దాచాడు. చుట్టరెండు చివర్లుచక్కగా కత్తిరించినట్లు కొరికి కాల్చి తృప్తిగా రెండు గుక్కలు పీల్చాడు.

జూలై చివరి రోజులు. ఆకాశం మబ్బేసి, అకాలంగా ఎముకలు కొరికే చలి ప్రారంభమైంది, అక్కడక్కడ రెండు మూడు చినుకులు రాలాయి.

వెంకన్న చుట్ట కాలుస్తూనే ప్రక్కమీద ఒరిగాడు. చుట్ట నలిపేసి ఓమూల దాచాడు. ఆవలిస్తూ కన్నుమూశాడు. కునుకు పట్టింది.

సడన్‌గా మెలుకువ వచ్చేసరికి గార్డు నారాయణరావుగారు చిరునవ్వుతో ఎదురుగా కనిపించారు. "అరెరె — నిద్రపోతున్నావనుకోలేదు వెంకన్నా — పాపం — పడుకో" సర్దుకోబోయాడు అసలు విషయాన్ని దాచేస్తూ.

"అబ్బే లేదుబాబు వూరకేఉన్నా చిల్లరేమన్నా కావాలా" వెంకన్న కుండబ్రద్దలు కొట్టినట్లు మాట్లాడే వైఖరి గార్డుగార్కి క్రొత్తేమీకాదు.

"ఆ .... కావాలి. అర్జంటుగా 265కి బుక్‌చేశారు. గార్డు ఇబ్రహింగారు సిక్‌చేశారట".

వెంకన్న మరేం మాట్లాడో.—చొక్కా. కం. బనియను జేబులోంచి ఓ అర్ధరూపాయి తీసి యిచ్చాడు.

"ఇదే ఉంది బాబు"

గార్డుగారు మవునంగా పుచ్చుకొని వెళ్ళిపోయారు.

తిరిగి వెంకన్న నిద్రకోసం భగీరధుని తపస్సు చేశాడు. నిష్ఫలమైంది. మనస్సు గత వర్తమాన భవిష్యత్తులోకి వూయలలూగింది. యోగసమాధిలో ఉన్న మౌనిచుట్టూ కళ్ళార్పకుండా

చూస్తున్నా చెవలపిల్లల్లా ఆహారంకోసం ఆవురు మంటూ ఆలోచన్లు నిలిచాయి.

ప్రతిమనిషికో చరిత్ర. ఏం తోచనప్పుడు మెదడుకు మేత. వెంకన్నకు అలాంటిదొక టుంది.

నలభై ఏండ్లక్రితం. ఓ అమావాశ్యరాత్రి. చిక్కని చీకట్లు నీలిదుప్పటి కప్పుకొన్న కృష్ణానదివి తెప్పలమీద దాటాడు. తల్లివల్లో ఆరేళ్ల కుర్రాడు. అమ్మా! కాదు. పిన్నమ్మ. తీవ్ర వర్షాల తాకిడికి కరగిపోతున్న మట్టిగోడలాటి సంఘటన. తనలో నిలువులోకి పోతువ్నాడు చుట్టూ మత్తు నలుపు. తెడ్ల మునకలు. నీళ్ల గలగలలు. కదలని మెదలని నీడలు. ఏంటో అంతా అయోమయం. తర్వాత తెలిసింది. అమ్మ చెప్పింది.

రాయలసీమలో కుగ్రామం. సుబ్బన్న వందెకరాల హరిజనుడు. పదహారు జతలెడ్లు. పది మంది కూలీలు. తోటా, దొడ్డి, పెద్దపెద్ద లోగిళ్లు. సత్రమంత కొంప. అన్నదమ్ములు అక్కాచెల్లెళ్ళు, బంధువులు, చుట్టప్రక్కాలు. అరబస్తా వడ్లెప్పుడూ ఆరబోసి ఉండాలి.

చెయ్యెత్తు మనిషి. చెబితే తిరుగులేదు. ధర్మ ఘర్మజలాలతో తడిసిన భూమాత పుష్కలంగా లభించేది. మూడువందల కడపకు ముక్కుపుడగ.

అకస్మాత్తుగా రేగింది ఆరని గాలిదుమారం. సుబ్బన్న తమ్ముడు చిన్న సుబ్బన్నకు మతి చెడిందట. పిచ్చెత్తిందట. కత్తి చేతపట్టి "కనిపించినోన్ని తెగేస్తా"నని వూర్లోబడ్డాడు.

గజగజలాడింది వూరంతా. "వూపిరుంటే ఉప్పు గల్లమ్ముకొని బ్రతకొచ్చు"నన్నారు. వూరు కదిలింది. వాడ కదిలింది. కాలికొద్దీ నడిచారు. కంచెకంప కలత్రొక్కారు. నాల్గు ప్రాంతాలకు చెదరిపోయారు. కాందిశీకులై వెడలిపోయారు.

సుబ్బన్న తమ్ముడికై తలబాదుకున్నాడు. ఆస్తి పోయిందన్న తలంపే లేదు. వలసపోయాడు ఉన్నవాళ్లతో. కృష్ణవేణమ్మ ప్రక్కలో వదిగాడు. పాకేశాడు. పస్తులున్నారు. నీళ్లతో కొన్నాళ్ల నెట్టుకొచ్చారు. నూకలు, రూకలు — మరి అన్నీ అక్కడే వదిలారు. మొత్తుకున్నారు. నెత్తులు బాదుకున్నారు. అడ్డమొచ్చిన దేమున్ని దేవతల్ని తిట్టిపోశారు. ఒకటి రెండు వారాలు నెలలు పస్తులున్నారు. ఆకలి మంటలు రగిలి విజృంభించాయి. సుబ్బన్న స్థితిజూచి రామమ్మ లబోమంది. నెత్తి కొట్టుకుంది. నేలకూలింది. ఉలకడు. పలకడు తినడు. వినడు.

యేరు దాటుదామన్నారు. సుళ్లు తిరిగి నాట్యమాడుతోంది కృష్ణ. వంతెనేలేదప్పు. యేన్గులు మొసళ్లు—కొండ—గోపురాలు కొట్టుకుపోతున్నాయి. ప్రళయకాల శివతాండవం పగిది ఒల్లు తెలియకుండా ఆడుతుంది. ఆడిందాకా ఆగాలి. అలసిందాకా ఉండాలి. అయితే అంత వ్యవధి లేదు. కలరామ్మ మారెమ్మ కలసివచ్చాయి. చైత్యహస్తాలు నిండుగాచూపాయి. దండిగా దొరికింది మేత.

ఒకనాటి నడిరేయి యేరు నిలిచింది. కదలని నీళ్లపై కదిలింది నావ. కనుచూపు మేరలో కనుపించేది నలుపు. నింగి నలుపు. నీళ్లు నలుపు. పొంగిపారలే కన్నీళ్ళు నలుపు. రానురాను వడ్డు దూరమైంది. పోనుపోను దరి చేరువైంది.

ఒక తరం సంగతి. ఇది సంక్షిప్తంగా వంశ చరిత్ర.

"బాబయ్యా" ఉలిక్కిపడి లేచాడు వెంకన్న. ఎదురుగా ఎ.ఎస్.యం. రంగనాథం కనుపించాడు.

"వెంకన్నా — ఆ షంటింగు ఇంజన్ బ్యాక్ చెయ్యాలి. ఆరోలైన్ పాయింట్‌కొట్టు"

"అలాగే బాబు"

రంగనాథం నాలుగడుగులేసి తిరిగి వచ్చి "జాగ్రత్త సుమీ చెమ్మగాఉంది. ఆ పాయింట్ సరిగా సెట్ అవదు".

"చిత్తం"

వెంకన్న మూలదాచిన చుట్ట వెలిగించి బయటికి నడిచాడు. చిన్నచిన్న తుప్పర్లు పడుతున్నవి. గుండెల్ని మందగించే చలేస్తోంది.

కొద్దిసేపట్లో తిరిగి బయలుదేరాడు. రెండు గంటలు బండి లేటు.

తిరిగి కునికాడు. ఏమిటో నిద్రరాదు. అటు యిటు కొట్టుకులాడాడు. తిరిగి ఆలోచన్లతో బుర్ర వేడెక్కింది.

తిరిగి ఆ వూర్లో ఏం జరిగిందో చిన్న సుబ్బన్న ఏమయ్యాడో తెలీలా. పతనమైన కుటుంబంలో అమ్మ (పిన్నమ్మ) తనూ మిగిలారు.

గారాబంగా పెంచింది. పెద్దచేసింది. చదువంటే అమ్మకు సంపాదనంటే చిన్నాన్న కిష్టం. ప్రతినిత్యం పోట్లాట. ఇంట్లో అశాంతి.

ఒకరోజు భోజనం వేళ. అమ్మ నాన్నకేకలు.

"వాడు అడ్డగాడిదలా ఉండి నాలుగురాళ్లు తెచ్చుకునేటప్పుడు పోషించేశక్తి నా దగ్గరలేదు. పధ్నాలుగేల్లొచ్చాక యిక చదివింది చాలు. వాడి పొట్ట వాన్ని పోషించుకోమను. లేకపోతే చచ్చిన వాళ్లతో పాటు. ....."

అమ్మ బోరుమంది.

మరునాడు బోయస్ మిలట్రీకి బర్తీ అయ్యాడు. చిన్నప్పన్నుంచి అభిమానం ఆత్మ గౌరవం హెచ్చు.

పదేళ్ళ తర్వాత ఇల్లుచేరాడు. "మదర్ సీరియస్" వైరొచ్చింది. రెక్కలు కట్టుకుని వాలాడు. అంతా ఐపోయింది.

ఎక్స్‌సర్వీస్ వాడుకనుక త్వరగా ఉద్యోగం దొరికింది. ఒక యింటివాడయ్యాడు. మిలట్రీలో సంపాదన పెట్టి ఇల్లుకొన్నాడు. అన్నీ పాకలే. తను రెల్లుకప్పాడు. సొగసుగా ప్రత్యేకంగా ఉంది తనయిల్లు. కొండనేల. దేవతాస్తానమదేగా మరి. రెస్ట్ ఉన్నప్పుడెల్లా యింటి పరిసరప్రాంతం శుభ్రంచేస్తాడు. వానల్లో కాయగూరలు పండిస్తాడు. కష్టాల్లో అర్ధభాగం భరించేది సతీమణి సుందరమ్మ.

సుందరమ్మ సంసారం పొదుపు చేయడంలో ఆరింద. ప్రతీ విషయంలో తను వేర్పి లెక్కలువ్రాసుకునేది. ఆరోగ్యమైన కూరగాయలు మన్నికకు ధరలకు సులువైన దేశీయ వస్త్రాలు సరుకులు వాడుతుంది. ఎప్పుడూ ఏదో పని చేస్తుంది. ఖాళీగా వున్నప్పుడు మిషను ముందేసుకుంటుంది. జాకెట్లు, రవికలు కుడుతుంది. పాలమ్ముతుంది.

వెంకన్న డ్యూటీలో ఉన్నంతసేపు తగు జాగ్రత్తగా ఉండేవాడు. పనివాళ్ళకు చౌకగా అంద జేస్తున్నారోజుల్లో స్లీపర్లు (కట్టెలు) కొనేవాడు. బొగ్గుగూడా. వంట చెరుకంత వ్యయమయ్యేదికాదు యింట్లో యాలంలో రైల్వే గడ్డిబీడులు కొనేవాడు. అవసరమున్నంత ఉంచి తక్కిందమ్మేవాడు. అంతేకాదు అడిగిన వాళ్ళకు పావలా అర్ధ యిచ్చేవాడు. జీతాలనాడు అంతా తమ ఎకౌంట్సు అప్ప చెప్పేవాళ్ళు.

వెంకన్న సంసారం ఏడుగురు. తను యిల్లాలు. ముగ్గురు మగవాళ్ళు, యిద్దరు ఆడంగులు. ఇద్దరు అత్తవారిళ్ళ కెళ్ళారు. బేషైన సంబంధాలని కొమ్ములు తిరిగిన వాళ్ళు సయితం ఒప్పుకున్నారు. ఆడిన మాట తప్పడు. అల్లుళ్ళకు మామగారంటే భయము. భక్తి, పితృ వాత్సల్యము.

కొడుకుల్లో పెద్దవాడు "ఇంజనీరింగు" చదువుతున్నాడు. చిన్నాడు ప్రీ యూనివర్సిటి ఉన్న వూల్లో. మూడవ వాడికి చదువు మీద లేదన్నాడు. చేతిపని అంటే అభిమానం. వ్రడంగం నేర్చుకుంటున్నాడు.

దేశ స్వాతంత్ర్యం వచ్చిందాకా సుందరమ్మ భర్తను అప్పుడప్పుడూ ఎత్తి పొడిచేది. "మీరు మతం పుచ్చుకొన్నట్లయితే మంచి ఉద్యోగం దొరికేదే. ఆ మేత్యూస్, జోసఫ్, వాళ్ళూ చూడండీ ఎంత హాయిగా బ్రతుకుతున్నారో.

వెంకన్న సన్నగా నవ్వేశాడు. నిజానికి వెంకన్న మిలట్రీలో ఉన్నప్పుడు తెల్ల దొరలు మతం పుచ్చుకోమని వేధించుకుతిన్నారు. తనతోటి వాళ్ళంతా స్వీకరించారు. ఆ రోజుల్లో అదోవెర్రి. వెంకన్న ససేమిరా విన్లా. మనస్సుకు వ్యతిరేకంగా నడవడం చేతగాదు. అందుకే వెంకన్న పీటర్ వెంకన్నా, మేత్యూస్ వెంకన్నా గాని అవలేదు. వెంకన్న వెంకన్నగానే ఉండి పోయాడు.

భార్య మాటలకు వెంకన్న చెప్పింది ఒక్కటే "కష్టపడ్డది నిలుస్తుంది. పరిస్థితుల్ని బటి వూసరవెల్లుల్లా రంగు పిరాయించడం ఆత్మ విద్రోహం. రంగులూడగానే అసలు స్వరూపం బయటపడి అవమానం పాలవుతాము".

"అందుకని అందినదాన్ని పోగొట్టుకుంటూ మటండి"."

మంచిగడ్డమీద పుట్టినవాడెవడూ అపని చెయ్యడు. అంతకంటే ఉరేసుకుని చావడం మేలు."

అలా సాగేది వాళ్ళ సంభాషణ.

కానీ స్వాతంత్ర్యం వచ్చాక ఆమె అభిమతం నార్చుకోక తప్పింది కాదు. ఇప్పుడు ప్రభుత్వం సకలవిధాలా హరిజనులకు తోడ్పడుతుంది. అందుకే వెంకన్న పిల్లలు అభివృద్ధిలోకి రాగలిగారు. కానీ ఖర్చులేకుండా పిల్లల చదువు సంధ్యలు పూర్తి అవుతున్నవి. ఇక వాళ్ళను ఆదుకున్నదల్లా ఒక్క తిండివిషయంలోనే.

తల్లి దండ్రి లేరు. పెద్ద చదువు సంస్కారం ఒకప్పుడు బికారి,మరోకప్పుడు వందెకరాల ఆసామి కొక్కడే కొడుకు.కానీ యిప్పుడు తిరిగి పెద్ద కుటుంబం. చుట్ట పక్కాలు. పొలం, యిల్లు వాకిలీ గొడ్డూ గోదా—. పరువు మర్యాద. నన్నే ఎలక్షన్లో చిన్న స్థానం. పెద్ద చదువుల్లో కొడుకులు.ఇద్దరుకూతుళ్ళకుపెళ్ళిళ్ళు. తను రిటైర్డ్ అవగానే తిరిగి ఐదారువేలు కళ్ళ జూస్తాడు. చిన్న అప్పులు తీర్చేస్తే మిగిలిందానితో మరో రెండెకరాలు మేరకొని పారేస్తాడు. యింక తనకు లోటేమిటి—యిదంతా డెబ్బయి రూపాయల జీతగాడి కృషీవలత్వమంటే ఎవ్వరూ నమ్మరు.

అప్రయత్నంగా వెంకన్నకళ్ళు చెమ్మగిల్లాయి. తల్లి జ్ఞాపకమొచ్చింది. ఏం లాభం ఆమెను చూశాడు కనుకనా. ఏదో మసగ మసగ స్వరూపం మాత్రం మనసులో కదిలేది. తల్లి స్థానంలో పిన్ని సాక్షాత్కరించింది.

ఓరోజున ఆమధ్య ఓముసలాడు ఇంటికొచ్చి బావురుమని ఏడ్చాడు. తరువాత తెలిసింది. అతను తన తండ్రిఉన్న వూరివాడట. ఆవృద్ధుడు ఎంతో యిదిగా చెప్పాడు. "బాబు, కాస్త, కూస్త వందెకరాలు. ఎట్లా వదులుకుంటావు. నీ తండ్రి తాతలనాటి ఆస్తి నీకప్ప చెప్పుతాను. పాతకాగితాలు అవీ తిరగేస్తే తప్పక ఆధారాలు దొరుకుతాయి. నామాట నమ్ము. తప్పక దావా వెయ్యి" అన్నాడు దృఢంగా.

"అదేంటి తాతగారు. ఆతరం దాటిపోయింది. ఋణం తీరిపోయింది. నేనేదో నా బ్రతుకు బ్రతుకుతూనే వున్నా. ఆప్రాంతంలోకి నేవచ్చి తిరిగి అక్కడ నివాస ముండేది నట్టిది. పైగా ఆస్తి అనుభవించేది వాయింటి పేరిటి వాళ్ళేగా. వేరే మరెవ్వరు కారుగదా. కష్టపడందే ఏదీలభించదు.పండించందేభూమి ఫలితమియ్యదు. ఎవరో ఒకరు దాన్ని అనుభవించనీ" అన్నాడు వెంకన్న.

అంతలో గుండెలు ప్రేలేలా "ధబ్" అని వాగెన్లు గుద్దుకున్న ధ్వనికి హడలిపోయాడు.

"ఈ రైల్వే పనిలో చేరినవాళ్ళకి తొందర్లో చెవుడొచ్చేస్తుంది" తనలో సిద్ధాంతీకరించుకున్నాడు వెంకన్న.

యిక మిగిలింది మూడేళ్ళ సర్వీసు. ఈ మూడేళ్ళలో తను కొన్ని అతి ముఖ్యమైన కార్యాలు తల పెట్టాడు. పిల్లల ఉద్యోగాన్వేషణ, వివాహాలు. డాబాపై ఓ అంతస్థు కట్టి పారేస్తే వేరొక గదిలో పడి ఉంటారు. దానివల్ల క్రొత్తగా స్థలంకొనాల్సిన అవసరం ఉండదు. తను రిటైర్డ్ అవగానే ఐదారువేలు చేతికందుతాయి. ఇక ఈ మూడేళ్ళలో కొంత కూడబెట్టవచ్చు. బ్యాంకిలో నాలుగైదు వందలున్నాయి. మొత్తం చేర్చి అప్పులు పూర్తి చేయాలి. తదనంతరం తను నిశ్చింతగా అరుగుమీద కూర్చుని ఆకాశంలోకి చుట్ట పొగలూదుకుంటూ కోడళ్ళచేత పరిచర్యల. స్వీకరించేది కనుకొలకుల్లో ఆనంద బాష్పాలు తొణికాయి.

తీయనితలంపులతో మత్తుగా నిద్ర పట్టింది. "వెంకన్న గారూ, వెంకన్న గారూ" తంబీ హడావిడిగా లేపాడు. వెంకన్న ఖిన్నకంగా లేచాడు.

తంబీ భుజం తడుతూ

"వెంకన్నగారూ ఆరోశైను పాయింట్—మీరుదా కొట్టారా"

"ఆ. అవి"

"అయ్యో కొంపమునిగింది స్వామీ. పాయింట్ సరిగా సెట్ కాలా గూడ్స్ వాగైన్ తలక్రింద పడింది".

"ఆ!!!"

"అవును. రాంగు పాయింట్"

"నిజమా—ఆరీ"

"అయ్యో—సత్యం"

వెంకన్న విచలితుడయ్యాడు.

★


# పాలు పొంగిపోకుండా ఆపుటకు

## పిరమిడ్ గ్లిసరీన్



క్రొద్దిగా పిరమిడ్ గ్లిసరీన్ పాలకాగు చుట్టూ లోభాగపు అంచునకు రుద్దండి, ఇంక పాలు కాగబెట్టండి, అవి పొంగిపోవు. అవి కాగుచుండగా మీరు తదితరపనులు చక్కబెట్టుకో వచ్చును.

శుద్ధమైన, ఆరోగ్యకరమగు పిరమిడ్ గ్లిసరీన్ ఔషధరీత్యాను, సౌందర్యకారిగాను, కాలమార్పుల నిమిత్తమున్ను, ఇంట్లో అనేక విధములుగాను ఉపయుక్తమైనది, ఒకసీసా దగ్గిరుంచుకోండి!




ఉచిత కర పత్రము! ఈ కూపన్ పూరించి హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్, పోస్టుబాక్సు నం. 409, బొంబాయి 1. కు పోస్టుద్వారా పంపండి.
పిరమిడ్ గ్లిసరీన్ ఇంట్లో వుపయోగించే విధమును తెలిపే ఆంగ్లేయ/హిందీ
* భాషలోగల ఉచితకర పత్రమును దయచేసి నాకు పంపండి.

నాపేరు, చిరునామా ..........................................

..........................................

* అక్కర్లేని భాషను కొట్టివేయండి

PYO. 15-X48 TL

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి